
లేఅవుట్‌లో కనికట్టు



ఎన్నికలకు ముందు హడావిడిగా ఇచ్చిన జగనన్న ఇంటిపట్టాలు చిత్తు కాగితాలుగా మారిపోయాయి. లేఅవుట్... స్థలాలు చూపకుండానే పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. ఓట్ల వేటలో పేదలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలో ఒకేరోజు ఇంటిపట్టాల పంపిణీ అంటూ ఆర్భాటం చేసి వందలమందికి ఇచ్చారు. అయితే వారిలో చాలామందికి పట్టాలు చేతిలో పెట్టి ఇదిగో జాగా...అదిగో ఇల్లు అంటూ వైసీపీ నాయకులు, దళారులు, అధికారులు మాయ చేశారు. మాకు ఇచ్చిన జగనన్న పట్టాకు జాగా ఎక్కడుంది మహాప్రభో....అంటూ నెలల తరబడి తిరిగినా ఫలితం లేకపోవడంతో చేసేదిలేక ఆ పట్టాను దాచిపెట్టుకొని వందలమంది పేదలు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు.

- స్థలాలు చూపకుండానే పట్టాలు పంపిణీ
- చిత్తు కాగితాలుగా జగనన్న పట్టాలు
- బి.కొత్తకోటలో పేదలను వెక్కిరిస్తూ...
- అమాయకులను మాయచేసిన వైసీపీ నేతలు.. దళారులు
- కూటమి ప్రభుత్వంపై పేదల ఆశలు


బి.కొత్తకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు బి.కొత్తకోట పట్టణ శివారు బెంగళూరు రోడ్డులో బీరంగి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు-59లో 477 ప్లాట్లతో ఓ లేఅవుట్ వేశారు. సర్వే పనులు పూర్తి చేసి స్కెచ్ సిద్ధం చేశారు. కొందరు వైసీపీ నాయకులు పేదల వద్ద నుంచి రూ.20 వేల నుంచి 30 వేలు వసూలు చేసి వారికి జగనన్న పట్టాలు ఇచ్చేశారు. ఆ లేఅవుట్‌ను చదును చేసింది కానీ, రోడ్లు, ప్లాట్లకు రాళ్లు నాటింది కానీ లేకుండానే అందులో కొన్ని ఏళ్ల నుంచి అనుభవంలో ఉన్నట్లు పొజిషన్ సర్టిఫికెట్లు కూడా ఇచ్చేశారు. తీరా చూస్తే ఆ లేఅవుట్‌పై అనేక అనుమానాలు తెరపైకి వచ్చాయి. అది అధికారికంగా లేనే లేదని, అందులో ఇచ్చిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు చెల్లవని అంటున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తాము డబ్బులు ఇచ్చిన దళారులు, రెవెన్యూ అధికారులను నిలదీస్తున్నారు. ఈ ప్రభుత్వంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ నెంబర్ నమోదు చేస్తే ముందే పట్టా ఇచ్చినట్లు చూపుతుందేమోనని బాధితులు వాపోతున్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో మూలుగుతున్న జగనన్న ఇంటిపట్టాలు

వాళ్లు వెళ్లిపోయారు.. వీళ్లు తెలియదంటున్నారు

పనికి వస్తాయో..చిత్తు కాగితాలుగా మిగిలిపోతాయో తెలియని జగనన్న పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లపై ప్రస్తుత రెవెన్యూ అధికారుల వద్దకు బాధితులు వెళ్లి ప్రశ్నిస్తే ఈ పట్టాల గురించి మాకు తెలియదు. ఇవి ఇచ్చినపుడు మేము లేము, ఇచ్చిన వాళ్లనే అడగండి అని అంటున్నారని బాధితులు వాపోతున్నారు. అప్పుడు పట్టాలు ఇచ్చిన ఓ ముఖ్య అధికారి రిటైర్ కాగా, ఇతర అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. అప్పట్లో రూ.లక్షలు చేతులు మారి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో పెద్ద స్కామే జరిగింది. 150కి పైగా ఆన్‌లైన్‌లో ఇచ్చిన సర్టిఫికెట్లకు తహశీల్దార్ సంతకం రివోక్ చేసేశారు. అవి కేవలం చిత్తు కాగితాలుగానే మిగిలాయి. అయినా చేయగలిగింది ఏమీ లేదు. సర్వే నెంబరు-59లో ఎలా స్థలాలు చూపలేదో అలాగే సర్వే నెంబర్-1022లో ఇంటి పట్టాలు ఇచ్చినా ఆ స్థలంలో కూడా లేఅవుట్ వేయలేదు. ఆ లేఅవుట్‌లో ఇచ్చిన ఇంటిపట్టాలకు ఏడాది దాటినా జాగా చూపలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.



వైసీపీ ప్రభుత్వంలో వేసిన ఉత్తుత్తి లేఅవుట్ స్కెచ్

కొత్తగా 700పైగా అర్జీలు..

ఒకేరోజు 1200 ఇళ్లపట్టాల పంపిణీ అంటూ వైసీపీ చేసిన హడావిడిలో పంపిణీ చేసిన వందల పట్టాలకు జాగా చూపకపోవడం, ఆన్‌లైన్‌లో లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఆశలతో పెద్దసంఖ్యలో ఆశావహులు తహశీల్దార్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇంటిపట్టా ఇవ్వాలంటూ అర్జీలు ఇస్తున్నారు. ఇందులో జగనన్న పట్టాలు పొందినవారు కూడా ఉన్నారు. తమకు పట్టా ఇచ్చినా ప్లాటు చూపలేదు కాబట్టి కొత్తగా ఇవ్వాలనేది వీరి వాదన. ఇటీవల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో వచ్చిన అర్జీలతో కలిపి 700కు పైగా అర్జీలు తహశీల్దార్ కార్యాలయంలో మూలుగుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరై పేదలకు పంచాల్సిన జగనన్న పట్టాలు సైతం ఈ అవకతవకల కారణంగా మూలన పడ్డాయి.



ఇంటి పట్టాల కోసం కొత్తగా వచ్చిన అర్జీలు

పట్టా ఇచ్చారు..జాగా చూపలేదు..



అందరికీ ఇచ్చినట్లే మాకు కూడా మీటింగ్‌లో పట్టా ఇచ్చారు. ఆ పట్టాకు జాగా ఎక్కడుందో మాకు తెలీదు. అప్పుడు ఎన్ని సార్లు తిరిగినా అదిగో ఇదిగో అన్నారు. ఇప్పుడేమో మాకు సంబంధం లేదు అంటున్నారు. బాడిగింట్లో ఉంటున్నాము. సొంతంగా ఒక చిన్న ఇల్లు కట్టుకుందాం అంటే ఇట్ల మోసం చేసినారు.

-నగీనా బాధితురాలు, బి.కొత్తకోట

ఈ ఉత్తపట్టాను ఏమి చేసుకోవాలి...



ఇంటి జాగా, ఇల్లు లేకుండా ఈ ఉత్తపట్టాను ఏమి చేసుకోవాలి. పట్టా ఇచ్చినోళ్లు జాగా కూడా చూపించాలి కదా. ఇప్పుడు మళ్లీ అప్లై చేసుకోవాలంటో అవుతుందో లేదో? అధికారులు మాకు న్యాయం చేయాలి.

- దిల్‌షాద్, బి.కొత్తకోట

పట్టా ఇచ్చినపుడు సంబరపడ్డాం..



ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఉంటున్నాం. జగనన్న ఇంటి పట్టా ఇవ్వగానే సంబరపడ్డాము. జాగా చూపిస్తారు. ఇల్లు కూడా వస్తుంది కట్టుకోవచ్చు అనుకున్నాము. సంవత్సరమైనా ఇప్పటికీ అతీగతీ లేదు. చివరికి ఉత్త పట్టా ఇంట్లో మిగిలింది. జాగా చూపిస్తే ఇల్లు కట్టుకుంటాం

- స్వర్ణలత బి.కొత్తకోట

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి

గతంలో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీలో అనేక సమస్యలు ఉన్నట్లు మా దృష్టికి కూడా వచ్చింది. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. పట్టా ఇచ్చి జాగా చూపని వారి విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి. వారు అర్హులు అయితే న్యాయం చేస్తాం.

- అజారుద్దీన్, తహశీల్దార్, బి.కొత్తకోట

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో కీలకమని, సమాజ ఆర్థికాభివృద్ధితో పాటు జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మూడవ త్రైమాసికం డిసెంబరు 31వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.10,290 కోట్లకు గానూ, రూ.13,544 కోట్ల రుణాలు మంజూరు చేసి 131.62 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాల్లో రూ.7,573 కోట్లు లక్ష్యానికి రూ.9,741 కోట్లు మంజూరు చేసి 132 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని తెలిపారు. ఇతర ప్రాధాన్యతా రంగంలో భాగంగా ఎంఎస్ఎంఈ సెక్టార్‌కు సంబంధించి రూ.987 కోట్లు మంజూరు చేసి కేవలం 7.5 శాతం ప్రగతి సాధించారని, దీనిని మరింత మెరుగుపరచాలని ఆర్బీఐ సూచించిన మేరకు 18 శాతం మేర రుణకల్పన ఉండాలని, అన్ని బ్యాంకులకు సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. మహిళా సంఘాలకు రుణకల్పనలో 64 శాతం ప్రగతి సాధించారని, ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం రుణాలు కల్పించాలన్నారు. పీఎం విశ్వకర్మ, స్టాండ్ అప్ ఇండియా పథకాల ప్రగతిలో చాలా వెనుకబడి ఉన్నారని, ఈ మాసాంతంలోగా లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఏఎల్‌డీఎం వన్నూరుబాషా, ఎస్బీఐ నాబార్డ్ ఏజీఎం విజయవిహారి, ఆర్బీఐ ఎల్డీఎం రోహిత్ అగర్వాల్, బ్యాంక్ మేనేజర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డిక్కీ, డీఐఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గౌరవంగా బతకండి

- నాటుసారా తయారీ విక్రయాలను ఉపేక్షించం
- సారా రహిత జిల్లా ధ్యేయం : ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నవోదయం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

వాల్మీకిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు విడిచిపెట్టి సమాజంలో గౌరవంగా బతకాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె గ్రామ పంచాయతీ ఎగువమేకలవారిపల్లెలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న చట్టాల మేరకు నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ప్రభుత్వం ఇచ్చే పథకాలు కూడా రద్దు అవుతాయని తెలిపారు. నాటుసారా తయారీ విషయంలో పదేపదే తప్పులకు పాల్పడితే రూ.2 లక్షలు జరిమానా, జైలు జీవితం, జిల్లా బహిష్కరణ లాంటి చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాటుసారా తయారీదారులు స్వచ్ఛందంగా మానుకోవాలని, జీవనోపాధి కష్టమయితే వారి కోసం ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో సారా కేసులలో ఉన్న వ్యక్తులను తక్షణం బైండోవర్ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ మాట్లాడుతూ నాటుసారా తయారీ విక్రయాలపై ఇప్పటి నుంచి కఠిన చర్యలు ఉంటాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు, పీడీ యాక్ట్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం నవోదయం పోస్టర్లను ఆవిష్కరించి గ్రామ ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎస్పీ వెంకటాద్రి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎక్సైజ్ ఏఎస్పీ జోగేంద్ర, సీఐలు ప్రసాద్‌బాబు, లత, ఎస్ఐలు చంద్రశేఖర్, మధురామచంద్రుడు, సుభాషిణి, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

7
హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోండి : ఎస్పీ

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఔదార్యం
- క్యాన్సర్ బాధిత విద్యార్థికి రూ.6 లక్షల సాయం
7

సూర్య, చంద్రప్రభ వాహనాలపై నరసింహస్వామి



సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామి వారి విహారం

గుర్రంకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి వారు సూర్య, చంద్ర, అశ్వవాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజల అనంతరం స్వామి వారిని సూర్యప్రభ వాహనంలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి చంద్రప్రభ వాహనంలో ఉంచి పుర వీధుల్లో విహరించి భక్తులను కరుణించారు. అనంతరం స్వామి వారిని అశ్వ వాహనంపై అధిరోహింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఆలయానికి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, ధనుష్, వరద, నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
రాయచోటి	6.30	5.03
మదనపల్లె	6.31	5.10
రాజంపేట	6.28	5.11
పీలేరు	6.29	5.02

అల్లర్ల కారకులను వదిలిపెట్టం

- కొంతమంది అల్లరి మూకల వల్లే గొడవలు
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, జేసీ

రాయచోటి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా కొందరు అల్లరి మూకల వల్ల అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, వాటికి కారకులను వదిలిపెట్టమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో హిందూ,ముస్లింలతో గురువారం శాంతి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. రంజాన్ పండుగ తర్వాత శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్తులో ఇటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4న గాంధీబజార్, ఠాణాసర్కిల్‌లో జరిగిన సంఘటనలతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని అపోహలు తలెత్తాయన్నారు. అన్నదమ్ముల్లా కలిసి జీవించే ప్రజల మధ్య కొన్ని వర్గాల వల్ల చిన్నపాటి గొడవ జరిగిందన్నారు. అప్పటి నుంచి పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసి ఈ వారం రోజులలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎక్కడా విఘాతం కలగలేదన్నారు. 40 సంవత్సరాలుగా రాజకీయంగా ఉన్న తమ కుటుంబం రాయచోటి ప్రాంత ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తోందన్నారు. గొడవల సంఘటనలో కారకుల మీద మాత్రమే చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధం లేని అమాయకులపై ఎటువంటి కేసులు పెట్టకూడదని పోలీసులకు చెప్పానన్నారు. కొంతమంది కావాలని సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారాల వల్ల చిన్న సంఘటన రాష్ట్రవ్యాప్తంగా పాకిపోయిందని అన్నారు. రంజాన్ తర్వాత మరోమారు శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి హిందూ, ముస్లింలు ఎప్పటికీ కలిసి మెలిసి ఉండేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో అమలులో ఉన్న 144 సెక్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో ఫీజురీయింబర్స్‌మెంటు పేరుతో నిరసన కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు పెట్టిన బకాయిలను తమ ప్రభుత్వం విడుదల చేస్తోందని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

సిద్దవటం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలో పల్లె మందగిరి శనీశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఉదయం 3 గంటలకు 2 లారీలు ఢీకొనడంతో ఒక లారీ అదుపు తప్పి అడవి ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కడప - చెన్నై జాతీయ రహదారి మందగిరి శనీశ్వరస్వామి గుడి వద్ద గురువారం ఉదయం 3 గంటల ప్రాంతంలో 2 లారీలు ఢీకొనడంతో లారీ అదుపు తప్పి అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. చెన్నై నుంచి కర్ణాటక వెళుతున్న లారీ ఎర్రగుంట్ల నుంచి రాజంపేట వెళుతున్న మరో లారీ ఢీకొనడంతో చెన్నై నుంచి కర్ణాటకకు వెళుతున్న లారీ అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది.ఎటువంటి ప్రమాదాలు జరగలేదని సీఐ బాబు తెలిపారు.

కుదేలైన మట్టి ఇటుకల వ్యాపారం

- ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్న వ్యాపారులు
- భవన నిర్మాణం, వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలు
- వ్యాపారాలు లేక మూడేళ్లుగా ఎక్కడ బట్టీలు అక్కడే


వృథాగా ఉన్న కూలీల వసతి గృహాలు


సాతపల్లె సమీపంలో నిరుపయోగంగా ఇటుకల బట్టీలు


మూలనపడిన మట్టి తోలుడు బండ్లు

పెనగలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మట్టి ఇటుకల వ్యాపారం కుదేలైంది. సిమెంట్ ఇటుకల వ్యాపారం పుంజుకోవడంతో మట్టి ఇటుకలకు గిరాకీ తగ్గింది. మట్టి ఇటుకల తయారీ పనికి వెళ్లే కూలీలు భవన నిర్మాణం, వ్యవసాయం, ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. మట్టి ఇటుకలు వ్యాపారం చేసి నాలుగు రాళ్లు సంపాదిద్దామని ఆశపడి గుట్టలు, గుట్టలుగా కల్లాలలో తోలిన మట్టి కుప్పల పైన పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా ఉన్నాయి. నిరుపయోగంగా కూలీల నివాసాలు, పనిముట్లు ఇటుకలు తయారీ కోసం బయట ప్రాంతాల నుంచి కూడా కూలీలను తీసుకువచ్చి వారి కుటుంబ సభ్యులు నివాసం ఉండేందుకు వ్యాపారులు రేకుల షెడ్లు, గుడిసెలు వేసి వసతి కల్పించేవారు. ఇప్పుడు అవన్నీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అలాగే ఇటుకల తయారీ కోసం ఉపయోగించే బండ్లు, పారలు సైతం మూలనపడ్డాయి. ప్రస్తుతం వెయ్యి ఇటుకల ధర రూ.5 వేల నుంచి 7 వేల దాకా ధర ఉన్నాయి. మూడేళ్ల కిందట వెయ్యి ఇటుకలు ఒక యేడాదంతా రూ.10 వేలకు తగ్గకుండా అమ్ముడుపోయాయి. 2022 ఆగస్టు నుంచి డిసెంబరు వరకు వెయ్యి ఇటుకలు రూ.12 వేలకు తగ్గకుండా అమ్ముడుపోయాయి. ఈ ధర చూసిన పలువురు ఈ వ్యాపా రం వైపు మొగ్గుచూపారు. అనతికాలంలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐఏవై ద్వారా పక్కా ఇళ్లు మంజూరు చేసి ఇళ్లు త్వరగా నిర్మించుకున్న వారికే బిల్లులు ఇస్తామని, లేకుంటే బిల్లులు ఆపేస్తారని తెలపడంతో ఒక్కసారిగా సిమెంట్ ఇటుకల వ్యా పారం పుంజుకుంది. ఒక్కో జగనన్న కాలనీలో 90 శాతం సిమెంట్ ఇటుకల ఇళ్ల నిర్మాణమే జరుగుతుండడం వల్ల మట్టి ఇటుకల వ్యాపారం పడిపోయింది. అప్పటి నుంచి మట్టి ఇటుకల వ్యాపారం పుంజుకోలేదు. వడ్డీలకు డబ్బు తెచ్చి వ్యాపారం చేసే వారు మాత్రం రెండేళ్ల నుంచి పూర్తిగా ఇటుకల తయారీని ఆపివేశారు. పెనగలూరు మండల కేంద్రంలో ఒకప్పుడు 30 మంది వ్యాపారులు ఉండేవారు. ఇప్పుడు ఐదుగురు మాత్రమే కొద్ది కొద్దిగా వ్యాపారం చేస్తున్నారు.


ప్రత్యామ్నాయం చూస్తున్నా



నేను చిన్న మట్టి ఇటుకల వ్యాపారిని. కుటుంబ ఖర్చులకు సరిపడా ఆదాయం వచ్చేది. మూడేళ్ల నుంచి వ్యాపారం పూర్తిగా పడిపోయింది. కుటుంబ ఖర్చులకు కూడా కష్ట మైపోయింది. పాడి వ్యాపారమే మేలనిపిస్తోంది.

- ఎర్రబల్లె రవీంద్ర, వ్యాపారి, పెనగలూరు

వ్యవసాయమే మేలనిపిస్తోంది



వ్యవసాయంలో నష్టాలు తప్ప లాభాలు రాకపోవడంతో మట్టి ఇటుకల తయారీ వ్యాపారం వైపు మొగ్గు చూపాను. కొన్నేళ్లు ఇటుకల వ్యాపారంచేశాను. పదిమంది కూలీలకు పనులు కల్పిస్తున్నానన్న తృప్తి కూడా ఉండేది. ఆ ఆనందం కొంత కాలమే మిగిలింది.

- బత్తల వెంకటయ్య, సాతపల్లె

వ్యవసాయ పనులకు పోతున్నా



ఒకప్పుడు నాతోపాటు నా కుటుంబం మొత్తం ఇటుకల పనులకు వెళ్లేవాళ్లం. మూడేళ్ల నుంచి ఇటుక పనులు లేక వ్యవసాయ పనులకు పోతున్నా. ఒకప్పుడు ఇటుక పనికి రావాలని వ్యాపారులు ఒకరిమీద ఒకరు పోటాపోటీగా పిలిచేవారు. ప్రస్తుతం అలా పిలిచేవారే లేరు.

- తూపిలి వెంకటరమణ, దళితవాడ, పెనగలూరు

అన్నమయ్య బాధితులకు ఆదరణ: టీడీపీ


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులందరిని కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం రాజంపేట టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో అన్నమయ్య వరద బాధితులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు దురాగతాలు, అవినీతి వల్లే అన్నమయ్య డ్యాం తెగిపోయిందన్నారు. అన్నమయ్య బాధితుల అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. పులపత్తూరు అన్నమయ్య వరద బాధితులతో పాటు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల

రాజంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కేఎంఎల్ ఫౌండేషన్ చైర్మన్ కేఎంఎల్ నరసింహ ఆధ్వర్యంలో గురువారం రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా మొల్ల జయంతి

నందలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ నిర్వహించారు.

విజిలెన్స్ అధికారుల విచారణ


విచారణ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

వీరబల్లి, మార్చి13(ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం సానిపాయి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై నేతి రమేశ్, నేతి రాంమోహన్, గుగ్గిళ్ల వెంకటేశ్‌పై అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కడప డివిజన్ విజిలెన్స్ డీఈ జోకబ్‌పాల్, జేఈ విశ్వనాథన్ రికార్డులను పరిశీలించారు. ప్రతి ఎంటీ నమోదుపై క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఎంట్రీని, ఎంట్రీ రికార్డులు నమోదు చేసుకొని పూర్తి నివేదికలపై అధికారులకు సమర్పిస్తామన్నారు.

విజయకేతనం కోసం చలో పిఠాపురం

సిద్దవటం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గం పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో భారీగా బయలుదేరారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు పీఠాపురంలో శుక్రవారం జరిగే ఆవిర్భావ సభకు పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం సిద్దవటం మీదుగా తంబళ్లపల్లె, మదనపల్లె, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం తదితర మండలాల నుంచి జనసైనికులు, వీర మహిళలు 50 బస్సులు, 200 కార్లల్లో తరలివెళ్లారు. సిద్దవటంలో 2 వేల మందికి క్రిష్ణ అనుచరులు భోజన వసతి కల్పించారు.

కరుణించవమ్మా.. కనకరుద్రాణి

పుల్లంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీవీజీపల్లె, రామసముద్రం గ్రామ పంచాయతీల సరిహద్దులో గల దేవరకొండగుట్ట వద్ద వెలసిన కనకరుద్రమ్మ తిరునాల గురువారం వైభవంగా జరిగింది. 'కరుణించివమ్మ కనకరుద్రాణి' అంటూ వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పీవీజీపల్లెలో విడిది అనంతరం తెల్లవారుజామున కనకరుద్రమ్మను ఆలయంలోకి తీసుకువచ్చారు. చెక్కభజన, కోలాటం నిర్వహించారు. భక్తులకు చలివేంద్రాలు, మజ్జిగ, అన్న సంతర్పణ చేశారు.

ఓపెన్ హౌస్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు


ఆయుధాల గురించి అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 250 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు వినియోగిస్తున్న వివిధ రకాల అత్యాధునిక ఆయుధాల గురించి బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సమాచార సాంకేతికత గురించి అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా మొబైల్ అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్, మహిళల స్వీయ రక్షణ, శక్తి యాప్ గురించి వివరించామ న్నారు. డైల్ 100/112 గురించి, 1098 నెంబర్ల గురించి వివరించారు. ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, ఆర్ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, రవి, పోలీసు సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం


సచివాలయాన్ని ప్రారంభించిన ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నంపల్లె గ్రామ పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకులు జి.వెంకటేశ్వర్‌రాజు,మండల సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాలు, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనరసయ్య, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన్నూరు సీఐగా కుళాయప్ప


కుళాయప్ప

రాజంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మన్నూరు పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.కుళాయప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు, సుండుపల్లె, చింతకొమ్మదిన్నె, రిమ్స్, దువ్వూరులలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించి చిత్తూరులో సీఐగా పనిచేశానన్నారు. అనంతరం ఆయన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ మనోజ్ హెగ్డేలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

వైభవోపేతంగా మల్లూరమ్మ జాతర


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి

చిన్నమండెం,మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ మాండవ్యనది ఒడ్డున వెలిసిన మల్లూరమ్మ తల్లి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ 6 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, 97 మంది కానిస్టేబుళ్లతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని, ఆరు చోట్ల పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేస్తామని, అల్లర్లకు పాల్పడరాదని పేర్కొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

ప్రభుత్వం తరఫున మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను, చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు. ఈ సందర్భంగా పాకాల రవిచంద్రకు రూ.4 లక్షలా 49 వేలా 34, పెద్దపుత్త అన్నయ్యకు రూ.ఒక లక్ష 20 వేలా 389, పందిపోటు సుబ్బమ్మకు రూ.81 వేలా 757, గండిపల్లి ప్రభావతికి రూ.45 వేలా 600, కె.లక్ష్మమ్మకు రూ.43 వేలా 972, చంద్రశేఖర్‌కు రూ.ఒక లక్షా 20 వేలా 430, సోమలరాజుకు ఒక లక్ష 191, శివయ్యకు 38 వేలా 700, కిరణ్‌కు రూ.43 వేలా 795, నర్రి మల్లికార్జుననాయుడికి రూ.43 వేలా 911, కొండవీటి వాసుదేవనాయుడికి రూ.78 వేలా 513, బసిరెడ్డి మంజునాథరెడ్డికి రూ.59 వేలా 883. రాగినూతన మల్లికార్జునకు రూ.80 వేలా 519, ఆర్ల మల్లికార్జునకు రూ.20 వేలు, రేవతికి రూ.61 వేలా 920, బి. విజయ్‌కుమార్‌కు 75 వేలా 090, టీ. శ్రీనివాసులుకు ఒక లక్షా 75 వేలు, సీ.రామదాసునాయుడికి ఒక లక్షా 7 వేలా 205, పార్వతమ్మకు రూ.2 లక్షలా 59 వేలా 914, శ్రీనివాసులరెడ్డికి రూ.2 లక్షలా 50 వేల చొప్పున ఎల్‌వోసీ పత్రాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పే ర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్టహౌస్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బాధితుల సమస్యలను పరిష్కరించారు.

పేదల క్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

చిన్నమండెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): పేదల క్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం గురించి అహర్నిశలూ కృషి చేస్తోందన్నారు. అనంతరం బాధితుల అర్జీలను స్వీకరించారు.

సంక్షిప్తం

లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జ్‌గా ఉషారాణి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 13(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా లక్కిరెడ్డిపల్లె ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న ఉషారాణికి గురువారం బాధ్యతలు అప్పగించారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రెడ్డెయ్యను ఒంటిమిట్ట మండలంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌లో సస్పెండ్ కావడంతో ఉషారాణిని ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమించారు.

ఘనంగా యంత్రాభిషేకం


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

నందలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లెలో నిర్మించిన రామాలయంలో గురువారం గొల్లపల్లె గ్రామస్థుల ఆధ్వర్యంలో వేదపండితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ బృందంచే యంత్రాభిషేకం, దీక్షా హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.గురు, శుక్రవారాల్లో విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో మేలు


రైతులతో మాట్లాడుతున్న నాగమణి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి వస్తుందని ఉద్యానవనశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. గురువారం మద్దిరేవులలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచు చంద్రమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఉత్సవాలు


దర్గా వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రామాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సమీపంలోని సద్గురు సాయి దర్బారు నగర్‌లో వెలిసిన సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి, రహంతుల్లా అలైబాబా జలీల్ మస్తాన్ వల్లిబాబా గంధం ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళల ప్రగతి సాధ్యం

పెనగలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక స్వాలంబనతోనే మహిళల ప్రగతి సాధ్యమని పెనగలూరు మండల ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. పెనగలూరు గాంధీనగర్, ఎస్టీ కాలనీలో గురువారం కార్యకర్త అంజలి అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం జరిగింది. డిజిటల్ అక్షరాస్యత కౌన్సిలర్ హరిబాబు, వెలుగు సీసీ శివయ్య, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలను తొలగించండి: సీపీఐ

రాయచోటిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో చెత్తకుప్పలను తొలగించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర డిమాండ్ చేశారు. గురువారం వారు 11వ వార్డులోని ఆదిరెడ్డి మిషన్ వెనుకవైపు ఇళ్ల మధ్యన పేరుకుపోయిన చెత్తకుప్పలను పరిశీలించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

గాలివీడు, మార్చి13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన గృహాలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం చేనేత అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం నూలివీడు మార్గంలో ఉన్న నల్లగుట్ట లేఅవుట్‌ను లబ్ధిదారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, వీధి దీపాలు, మురుగుకాలువలు, కుళాయిలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. గాలివీడు రోడులో గల అర్చనా కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం ఏర్పాటు చేద్దాం

రాజంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : టీబీ లేని సమాజాన్ని ఏర్పాటు చేద్దామని రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ పేర్కొన్నారు. టీబీ పర్యవేక్షకుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఉర్దూ ఉన్నత పాఠశాలలో టీబీ వ్యాధి నివారణపై విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో శేఖర్ పాల్గొన్నారు.

కంట్లో కారంచల్లి కత్తితో దాడి

- మహిళకు తీవ్ర గాయాలు
- మెడలోని బంగారు గొలుసు అపహరణ


గాయపడిన లక్ష్మీదేవి

కమలాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కంట్లో కారం చల్లి.. కత్తితో దాడి చేసి మహిళ మెడలోని బంగారు గొలుసు దోచుకెళ్లిన సంఘటన గురువారం కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. కమలాపురంలోని గిడ్డంగి వీధిలో లక్ష్మి దేవి అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా.. అదే వీధికి చెందిన నవీన్ అనే యువకుడు ఆమె కంట్లోకారం పొడి చల్లి కత్తితో దాడి చేశాడు. దాడిలో మహిళ ముక్కు, మెడతో పాటు పలుచోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావంతో పడిపోయింది. దీంతో ఆమె మెడలో ఉన్న పది తులాల బంగారుసరుడు దోచుకెళ్లాడు. గాయపడిన మహిళను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అం దించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుని కోసం గాలింపు చర్యలు చేప ట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు.

స్కూటర్లు ఢీ.. వ్యక్తి మృతి

రాజుపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రెండు స్కూటర్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ కత్తి వెంకట రమణ వివరాల మేరకు.. గురువారం గాదెగూడూరు గ్రామానికి చెందిన సుంకు ప్రసాద్ (56) తమ గ్రామం నుంచి మోటారు సైకిల్‌లో ప్రొద్దుటూరుకు వెళుతున్నాడు. అదే సమయంలో టంగుటూరు గ్రామానికి చెందిన కాసా వెంకటసుబ్బారెడ్డి తన మోటరు సైకిలులో ప్రొద్దుటూరు వైపు నుంచి వెంగలాయపల్లెకు వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుంకు ప్రసాద్ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణ జింకలు మృతి


మృతి చెందిన కృష్ణ జింక

ములకలచెరువు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణజింకలు మృతి చెందాయి. స్థానిక పీటీఎం రోడ్డులోని టీటీడీ కల్యాణమండపం సమీపంలో రోడ్డు దాటుతున్న కృష్ణ జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ జింక అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే కదిరినాథునికోట పంచాయతీ కాసుపల్లె వద్ద కుక్కల గుంపు దాడి చేయడంతో మరో కృష్ణ జింక మృతి చెందింది. రెండు వేర్వేరు ఘటనల్లో మృతిచెందిన జింకలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం జింకల కళేబరాలను ఖననం చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

చాపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు గ్రామంలో హోసయ్య (45) అనే వ్యక్తి గురువారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజమండ్రికి చెందిన హోసయ్య పశువుల షెడ్డులో పనిచేస్తుండేవాడు. గురువారం హోసయ్య కరెంటు తీగెలు లాగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన కుటుంబ సభ్యులు ఇంకా ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి


దగ్గటూరు రాజా మృతదేహం

సికెదిన్నె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపు తప్పి దగ్గటూరు రాజా (58) అనే వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజా, మహేశ్వర్‌రెడ్డిలు పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా మూలవంక, కొత్తపేట మధ్యలో బైకుకు అడ్డంగా కుక్కరావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొన్నారు. ప్రమాదంలో దగ్గటూరు రాజా మరణించగా... గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన పెద్దపల్లి మాధవీ అదృశ్యమైనట్లు తాలుకా పోలీసులు తెలిపారు. బాలాజీనగర్‌కు చెందిన మాధవీ 2023 మార్చి 23న ఇంటి వద్ద నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె ఆచూకీ కోసం బంధువులను విచారించగా సరైన సమా చారం లేకపోవడంతో ఆమె భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యా దు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలిక



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధికి చెందిన కొమ్మనూరు స్వీటీ (16) అనే బాలిక అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాధరెడ్డి తెలిపారు. గత నెల 25న ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రాజంపేటలో పౌల్ట్రీస్థలం పరిశీలన

- ఇతర స్థలాలపై కూడా దృష్టి
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి


రాజంపేటలో ఎస్సీ కార్పొరేషన్ స్థలాలను పరిశీలిస్తున్న ఈడీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ స్థలాలు పరిశీలించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం అనే శీర్షిక ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ఎస్సీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం స్థలాల పశీలనకు సిద్ధమైంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇందులో భాగంగా రాజంపేట మండలంలోని తాళ్లపాక వద్దనున్న పౌల్ట్రీ కాంప్లెక్స్ స్థలాలను గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, డైరెక్టర్ అనిత దీప్తి, దళిత సంఘాల ప్రతినిధులు పరిశీలించారు. ఈ విషయంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి సంప్రదించగా రాజంపేట వద్దనున్న పౌల్ట్రీలో చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. గతంలో జీవనాధారం కోసం పౌల్ట్రీలు ఇచ్చిన వారిలో కొంత మంది అందుబాటులో లేకపోవడంతో మరో దఫా పరిశీలించాల్సి ఉందన్నారు. తహసీల్దార్ కూడా అందుబాటులో లేరన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన మొత్తం పది ఎకరాలు స్థలం ఉండగా పౌల్ట్రీ షెడ్ల కోసం కొంత స్థలాన్ని నిర్మించి మిగిలిన జాగాను ఖాళీగా ఉంచడం జరిగిందన్నారు. ఆ ఖాళీస్థలం కూడా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. కొంత స్థలాన్ని కొంతమంది విక్రయించినట్లు కూడా తమ విచారణలో ఆరోపణలు వచ్చాయన్నారు. ఏదిఏమైన ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన భూములు ఎంత వరకు ఉన్నాయనే విషయంపై తహసీల్దార్‌కు లేఖ రాసి హద్దులు చూపమని అడగనున్నట్లు తెలిపారు. పౌల్ట్రీ స్థలాల ఆక్రమణ అంశంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె వివరించారు.

హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోండి

రాయచోటిటౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): హోలి పండుగను సురక్షితంగా, బాధ్యతతో జరుపుకోవాలని... పండుగ పేరుతో సంబంధం లేని వ్యక్తులపై రంగులు చల్లినా, ఆడవారితో అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా హోలీ పండుగను జరుపుకోవాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని తెలిపారు. హోలీ పేరుతో ఎవరైనా ఎవరైనా బలవంతంగా చందాలు వసూలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వీధుల్లో ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా తిరగడం, భారీ శబ్దాలు చేయడం లాంటివి అనుమతి లేదన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100, 112 నెంబర్లకు డయల్ చేయడమే కాకుండా సమీప పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

మత సామరస్యం పాటించాలి : కడప ఎస్పీ

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోళీ పండుగను సురక్షితంగా .. బాధ్యతతో మత సామరస్యం పాటిస్తూ.. ఎటువంటి గొడవలకు తావు లేకుండా సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా హద్దులు దాటితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం లాంటివి చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

రోడ్డుప్రమాదంపై రవాణాశాఖ అధికారి విచారణ


విచారణ చేస్తున్న రవాణాశాఖ అధికారి శ్వేత

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): కడప నగరంలో ఈ నెల 7న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై రవాణా శాఖ అధికారి శ్వేత గురువా రం విచారణ చేపట్టారు. ఏడు రోడ్ల వద్ద రోడ్డుదాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొన డంతో సంఘట నాస్థలంలో మృతి చెందాడు. ఈ ఘట నపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేయగా బస్సు కండీ షన్‌పై గురువారం ఉదయం రవాణాశాఖ అధికారి శ్వేత దర్యాప్తు చేపట్టారు. ఏడు రోడ్ల వద్ద ప్రతిరోజూ రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పదుల సంఖ్యలో నిలబెడుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతోందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నిసార్లు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యజమానులకు చెప్పినా అక్కడే గంటల కొద్దీ బస్సులు నిలుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలకు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో బస్సుల యజమానులకు త్వరలో నోటీ సులు జారీ చేస్తామని ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లలో పోలీసుల తనిఖీలు



కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్లలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషే ధిత మత్తు పదార్థాలను పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండు, మేకలదొడ్డి తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లు, ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీల గోడౌన్‌లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలి

కడప (వినాయకనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డీఎస్సీకి ఉచిత కోచింగ్ తీసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎండీఎఫ్‌సీ.ఏపీఈఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఈ నెల 15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్ ప్రారంభించామని.. ఇప్పటికి వెయ్యి మంది అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్‌లు పూర్తి చేశారన్నారు. షార్టులిస్టు చేసిన అభ్యర్థుందరూ సకాలంలో వారి వెబ్ ఆప్షన్‌లు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. వెబ్ ఆప్షన్ సర్వీసు ద్వారా కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు.

ఖాజీపేటలో పేలనున్న మరో ఐపీ బాంబ్?

- రూ. 5 నుంచి 7 కోట్లతో వ్యాపారి పరార్


నూనె అంగడి వద్ద గుమికూడిన రుణదాతలు

ఖాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం రూ.2 కోట్లతో ఐపీ పెట్టిన వ్యక్తి గురించి చర్చించుకుంటుండగానే గురువారం మరో వ్యక్తి భారీ ఎత్తున ఐపీ పెట్టి ఉడాయించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట మండలం బోయపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత కొంత కాలంగా ఖాజీపేట వాసులకు పరిచయస్తుడే. ఇతను రియల్ ఎస్టేట్ వ్యాపారం, నూనె వ్యాపారం చేస్తూ ప్రజలను బాగా ఆకర్షించాడు. మూడు నెలల క్రితం ఖాజీపేట మైదుకూరు రహదారిలో సూపర్‌మార్కెట్ భారీ ఎత్తున ప్రారంభించాడు. దీంతో అడిగిన ప్రతి ఒక్కరు అతనికి రుణం ఇచ్చేందుకు ఇష్టపడ్డారు. ఇదే అదునుగా ఆ వ్యక్తి రూ. 5 కోట్ల నుంచి రూ.7 కోట్ల దాకా రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈనెల 10వ తేదీ 'ఆంధ్రజ్యోతి'లో ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబ్ కథనంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో సూపర్‌మార్కెట్ నడుపుతున్న వ్యక్తి పరిస్థితి గురించి తెలుసుకునేందుకు అక్కడకు వెళ్లగా.. ఆ వ్యక్తి అప్పటికే పరారీ అయి సెల్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో కోపోద్రిక్తులైన జనం సూపర్‌మార్కెట్‌తోపాటు ఆయిల్ అంగడి వద్ద గొడవచేయడంతో ఆ వ్యక్తి బావమరిది తాళాలు వేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించడానికి వెళ్లినట్లు సమాచారం. దీంతో ఖాజీపేట బస్టాండులోని కిరాణాషాపులో జరిగినట్లు ఇక్కడ కూడా సరుకు మాయం అవుతుందోమేమోనని రుణ దాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కడప కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన, క్రీడా వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల పోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 16వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ తెలిపారు. పోటీలలో పాల్గొనే యువత ఒన్ నేషన్.. ఒన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాసాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన వారు దేశస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ప్రధానంగా అన్నమయ్య, కడప జిల్లా పరిధిలోని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువత రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 15న కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఉపన్యాస పోటీలు రిజిస్ట్రేషన్ గడువు పెంపు కారణంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువత ఈ మార్పును గమనించాలని కోరారు. ఉపన్యాస పోటీలు తదుపరి నిర్వహించే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల్లో బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సాయంత్రం ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఎస్టీ వర్గానికి చెందిన వారికి రూ.75 వేలు, ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సాయం మొత్తాన్ని వివిధ దశల్లో అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం గతంలో ప్రభుత్వం వారు అందిస్తున్న 1.8 లక్షల రూపాయలకు అదనంగా ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 19,672 మందికి 100 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం గురించి చెప్పి దశల వారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ పీడీ సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఔదార్యం

- క్యాన్సర్ బాధిత విద్యార్థికి రూ.6లక్షల సాయం


బాధిత విద్యార్థి తండ్రికి రూ.6లక్షలను అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు, ఏఓ రవికుమార్

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థి జబ్బుతో బాధపడుతుంటే సహచర విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో విద్యార్థులు నడుపుతున్న సేవాసంస్థ ద్వారా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నుంచి రూ.5.02 లక్షలు, మిగిలిన ట్రిపుల్‌ఐటీల ద్వారా మరో లక్ష రూపాయలు సేకరించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సురేంద్ర అనే విద్యార్థి బ్లడ్ మరియు బోన్ క్యాన్సర్‌తో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు రూ.40లక్షలు చికిత్సకు అవసరం కాగా విద్యార్థులు సేకరించిన రూ.6లక్షలను బుధవారం ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్ చేతులమీదుగా బాధిత విద్యార్థి తండ్రి పౌలురాజుకు అందజేశారు. విద్యార్థుల సహాయాన్ని ఎన్నటికీ మరువలేనని విద్యార్థి తండ్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా దాతలు ముందు కొచ్చి సహాయం చేస్తే విద్యార్థి ప్రాణాలు కాపాడడంలో భాగస్వాములవుతారని... సహాయం చేయదలచిన వారు 8688283876 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కాశినాయన క్షేత్ర అభివృద్ధికోసం కేంద్ర మంత్రిని కలిసిన రితేష్‌రెడ్డి


కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌ను కలసిన రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :కాశినాయన క్షేత్ర అభివృద్ధి కోసం కేంద్ర అటవీశాఖా మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఢిల్లీలో గురువారం రితేష్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల కాశినాయన క్షేత్రంలో జరిగిన కూల్చివేత ఘటనను కేంద్ర మంత్రికి వివరించి.. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి భూపేంద్రయాదవ్ ఆలయ సమస్య తీవ్ర తను అర్థం చేసుకొని.. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారని రితేష్ తెలిపారు.

కడప మెడికల్ కాలేజీ డీడీగా హేమలత

కలికిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ. హేమలతను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో మెడికల్ సర్వీసెస్ ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్‌గా డెప్యుటేషన్‌పై పని చేస్తున్న హేమలతను మాతృ సంస్థలోకి తిప్పి పంపుతూ ప్రస్తుతం ఖాళీగా వున్న వైద్య కళాశాల డీడీగా నియమించారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

కదిరి పౌర్ణమి వేడుకలకు ఆలయాల ముస్తాబు



కదిరి దేవుడి గుట్టలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పెద్దతిప్పసముద్రం మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న నరసింహస్వామి ఆలయాలు కదిరి పౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యాయి. గొందిపల్లె సమీపంలో కదిరి దేవుడి గుట్టలో వెలసిన అత్యంత శక్తివంతమైన దేవుడిగా పేరుగాంచిన నరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి స్వామి వారికి విశేషపూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, ప్రత్యేక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తారన్నారు. ఆలయానికి కర్ణాటక రాష్ట్రం సహా పరిసర ప్రాంతాలకు చెందిన నరసింహస్వామి భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. రాత్రికి ఆలయంలో స్వామి వారి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారన్నారు. రాత్రికి ఆలయంలో హరికథ కాలక్షేపం నిర్వహిస్తారన్నారు.

ఈజీ మార్ట్‌లో నాణ్యమైన వస్తువులు అమ్మాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం నరసింహులు

పెద్దమండ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈజీ మార్ట్ ద్వారా అన్ని రకాల నాణ్యమైన వస్తువులను దిగుమతి చేసుకుని అమ్మకాలు కొనసాగించవచ్చని ఏపీఎం నరసింహులు పేర్కొన్నారు. మండల కార్యాలయ సముదాయంలోని శ్రీశక్తి భవన్‌లో గురువారం మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలుగు ఆర్థిక సహాయంతో ఈజీ మార్ట్ అనుసంధానంతో వెలుగు, పొదుపు మహిళా సంఘాలు చిన్నచిన్న దుకాణాలు నడుపుకోవచ్చన్నారు. ఇందులో నిత్యావసరుకులు, ఇంటి సామగ్రి కూడా అమ్ముకోవచ్చని తెలిపారు. పేదల ఆర్థికాభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. ప్రతి కుటుంబం ఆదాయ మార్గాలు ఎంచుకోవాలన్నారు. మండల సమాఖ్య సమావేశాలకు వీఓ లీడర్లు తప్పకుండా హాజరుకావాలన్నారు. గ్రామ సమాఖ్య సమస్య లు మండల సమాఖ్య దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు జరీనా, కార్యదర్శి గులాజ్‌బాన్, సీసీ శంకరమ్మ, భారతి, శ్రీనివాసులు, రెడ్డమ్మ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వంట నూనెలు - నూనె గింజలపై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు వైవీ రమణారావు

పీలేరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి రైతు శిక్షణ నిర్వహించారు. సహాయ సంచాలకులు వైవీ రమణారావు మాట్లాడుతూ వేరుశనగలో యాజమాన్యపద్ధతుల గురించి తెలియజేశారు. ప్రీ ఎమెర్జెన్స్ కలుపు మందు వాడకం, ఎరువుల వాడకం, భూసార పరీక్షలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. పచ్చరొట్ట ఎరువుల ఉపయోగాలు, రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రాముఖ్యతలపై వివరించారు. కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె మండలాల వ్యవసాయ అధికారులు రమాదేవి, శ్రావణి, టెక్నికల్ ఏఓ కరుణాకర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది జహీర్, ప్రవీణ్, అనీల్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

- ఎండోమెంట్ ఏసీకి బీవైఎస్ వినతి




ఎండోమెంట్ ఏసీ విశ్వనాథకు వినతి పత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దేవుని మాన్యం భూములను కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. గురువారం రాయచోటిలోని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరెడ్డిని కలసి బీవైఎస్ నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.కోట్ల విలువైన దేవునిమాన్యం భూములకు రక్షణ కరవైందన్నారు. పలు ప్రాంతాల్లో ఈ భూములను ఆక్రమించుకుని కొందరు షాపింగ్ గదులు, మరికొందరు బంకులు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారన్నారు. ఇంకొందరు ఏకంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. దేవునిమాన్యం భూముల్లో వున్న ఇసుకను కొల్లగొట్టి అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారన్నారు. వీటన్నింటిపై దేవదాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి రూ.కోట్ల విలువైన దేవుని మాన్యం భూములను కాపాడాలని కోరారు. బీవైఎస్ నేతలు జలానిబాషా, శ్రీనాథ్, జగదీష్, వెంకటేష్, జశ్వంత్, ఉదయ్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు న్యాయం చేయాలి

బి.కొత్తకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు కోసం 19న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను బి.కొత్తకోటలో గురువారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 22 ఏళ్ళుగా కార్మికులు కనీస వేతనానికి నోచుకోకుండా కేవలం రూ.3వేలకు వెట్టిచాకిరీ చేస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా వారి వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు సలీంబాష, వేణుగోపాల్‌రెడ్డి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకురాలు అలివేలమ్మ, బాలక్రిష్ణ, జయమ్మ, బీబీజాన్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీరుగారిపోతున్న అట్రాసిటీ కేసులు



వడ్డే రామచంద్రను కలిసిన శ్రీచందు

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నీరుగారిపోతున్నాయని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆవేదన చెందారు. గురువారం ఢిల్లీ పర్యటనలో ఎస్సీఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లె రామచంద్రను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీలను చట్టపరంగా ఆదుకోవాలని కోరారు. బహుజన సేన ఎస్టీ జిల్లా అధ్యక్షుడు మూడే రూపక్ నాయక్ పాల్గొన్నారు.

30 ఏళ్లుగా ప్రతిపాదనలతోనే....

పెద్దమండ్యం బ్రిడ్జి కోసం ప్రజల ఎదురు చూపులు



ఎండకాలంలో రోడ్డు ఇలా...



వర్షాకాలంలో రోడ్డు ఇలా...

పెద్దమండ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సుమారు 30 ఏళ్లగా ప్రతిపాదనలతోనే సరిపుచ్చుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారాస్త్రంగా మారిందే తప్ప ప్రజల కోసం ఏ ప్రజాప్రతినిధీ పనిచేసిన పాపన పోలేదు. గెలుపోటములను శాసించే మండలంగా గుర్తింపు ఉన్నా ఒక వంతెనను నిర్మించుకోలేక పోయారనే అపవాదు లేక పోలేదు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారనేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణమే సాక్ష్యం. వివరాల్లోకెళితే.... పెద్దమండ్యం సమీపంలోని కుషావతినదిపై బ్రిడ్జి ని ర్మాణం కోసం అధికారులు 30 ఏళ్లగా ప్రతిపాదనలతోనే సరి పుచ్చుతున్నారు. పెద్దమండ్యం పంచాయతీలో ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రజా ప్ర తినిధులు, అధికారులు విఫలమయ్యారని, ఇం దుకు నిదర్శనం బ్రిడ్జి నిర్మాణమే. భారీ బ్రిడ్జి లేక ప్రయాణీకులు, స్థానిక ప్రజలు పలు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఇక్కడ వాహనాల రాక పోకలు కూడా స్థంభించిపోతా యి. చిన్నారులు బడికి వెళ్లాలన్నా ఏట్లో దిగి నడి చివెళ్లాల్సి వస్తోంది. ఈవిషయం అధికారులు, ప్రజా ప్రతి నిధులకు కనబడలేదా, ఈ సమస్యపై ప్రజల గొంతు వినబడలేదాఅనే విమర్శలొస్తున్నాయి. కుషావతినదిపై బ్రిడ్జి నిర్మించాలని తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యేలు ఏవీ లక్ష్మీదేవమ్మ, ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జి.శంకర్‌యాదవ్, దివంగత మాజీ ఎమ్మె ల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి సహా ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారకనాదరెడ్డిని సైతం మండల ప్రజలు కోరా రు. మండల సమావేశాల్లో ప్రతిపాదనలు కూ డా చేస్తుంటారు, వర్షకాలంలో బ్రిడ్జి నిర్మిస్తామంటుంటారు. ఎండకాంలో మరిచిపోతారని ప్రజలు వాపోతున్నారు. నీవర్ తుపాన్‌కు ఈ నదిపై ప్రవహించిన నీటి ఉధృతికి వ్యాన్ కొట్టుకు పోయి కలిచెర్ల వ్యక్తి మృతి చెందాడు. నాలుగేళ్ల కిందట తరిగొండ- గుర్రంకొండ, పెద్దమండ్యం డబల్‌రోడ్డు నిర్మాణంలో మంజూరైన బ్రిడ్జి నిర్మాణంలో కూడా అధికారులు నిర్లక్ష్యం చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలలకు ముందుగా పెద్దమండ్యం మండల జనసేన అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్‌ను విజయవాడలో కలిసి పెద్దమండ్యం బ్రిడ్జి ఇబ్బందులపై వివరించారు. కూటమి ప్రభుత్వం కుషావతినదిపై భారీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి



పెద్దతిప్పసముద్రం మండల కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలు

పీలేరు/ కలికిరి/ మదనపల్లె టౌన్/నిమ్మనపల్లి /పెద్దతిప్పసముద్రం/వాల్మీకిపురం/రామసముద్రం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పీలేరు, కలికిరి మండలాల్లో పక్కా గృహాలు మంజూరై నిర్మాణాలు పూర్తిచేసుకోలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పీలేరు గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ రమణయ్య, ఎంపీడీఓ శివకుమార్, కలికిరి ఎంపీడీఓ భానుమూర్తి రావు, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండలంలో ప్రభుత్వ గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తూ వివిధ దశల్లో పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇళ్లకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించినట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు ప్రకటించారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70 వేలు కేటాయించినట్లు తెలిపారు. లబ్ధిదారులు కుల ధృవీకరణ పత్రాలను తీసుకుని సంబంధిత సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వద్ద, లేదా స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో గానీ మూడు రోజుల్లోగా అందజేయాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి ఇళ్ళు పూర్తి చేసుకునే విధంగా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు.

మదనపల్లె ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లుగా అంసపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా వున్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. నిమ్మనపల్లి మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు 350 మంది ఉన్నట్లు ఏఓ రమేష్, హౌసింగ్ ఏఈ అమరనాథ్ పేర్కొన్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ గృహనిర్మాణ లబ్ధిదారులకు చేయూత నందిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన వారు మాట్లాడుతూ పేద కుటుంబాల కోసం కూటమి ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు గృహాలు మంజూరై పూర్తి కాని ఎస్సీ, బీసీ, ఎస్టీ గృహనిర్మా ణ లబ్ధిదారులకు చేయూత నందిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు విస్తృత ప్రచారం చేయాలని, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వాల్మీకిపురం మండలంలో అసంపూర్తిగా నిర్మాణాలను వదిలేసిన 14మంది ఎస్టీలు, 156 మంది ఎస్సీలు, 29మంది బీసీలున్నట్లు గుర్తించారు. వీరికి నిధులు మంజూరయ్యాయని ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రామసముద్రం మండల సచివాలయ సెక్రటరీలు, హౌసింగ్ సిబ్బందితో ఎంపీడీఓ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని, సూచించారు. 17 నుంచి 19వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలన్నారు.

అదనపు సొమ్మును వినియోగించుకోండి

మున్సిపల్ కమిషనర్ ప్రమీల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమీల, ఏఈ దీన్‌దయాల్‌రాజు

మదనపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణాలకు ప్రభుత్వం అందించే అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, హౌసింగ్ ఏఈలు దీన్‌దయాల్‌రాజు, ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్, గృహనిర్మాణశాఖ సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గృహనిర్మాణ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. గతంలో యూనిట్‌తో సంబంధం లేకుండా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రకటించిందని కమిషనర్, హౌసింగ్ ఏఈలు గుర్తుచేశారు. ఈమొత్తం పూర్తి సబ్సిడీతో వినియోగించుకోవచ్చన్నారు. అర్ధంతరంగా నిలిపేసిన గృహాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వారు స్పష్టం చేశారు. వివరాలను గృహనిర్మాణశాఖ, గ్రామ, వార్డు సచివాలయాల్లో అమ్యూనిటీ సెక్రటరీని సంప్రదించాలని కమిషనర్ కోరారు. మే నెలలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన జీఓ నంబర్ 9 ప్రకారం 2019 నుంచి 2024 వరకూ నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని కమిషనర్, హౌసింగ్ ఏఈలు వివరించారు.

నాటుసారా తయారీకి బెల్లం సరఫరా చేయొద్దు

● ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర రెడ్డి



బెల్లం వ్యాపారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పీలేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ కోసం బెల్లం సరఫరా చేయవద్దని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కడప జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి బెల్లం రైతులు, వ్యాపారులను హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా గురువారం ఆయన పీలేరు మండలంలోని పలువురు బెల్లం వ్యాపారులు, రైతులతో పీలేరు ఎక్సైజ్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి నాటుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. నాటుసారా తయారీకి వినియోగించే ముడిసరుకు సరఫరాదారులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. అందుకోసం బెల్లం వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పీలేరు సీఐ సీవీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్స్ డే

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్స్ డేని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ ఏటా మార్చి 13న ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్స్ డే నిర్వహిస్తారన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను కొనియాడారు. ఆర్ఎంఓ షుకూర్, ల్యాబ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కాంగ్రెస్ నేతలు



మంత్రులను కలిసి జనసేనలో చేరిన కాంగ్రెస్ నేతలు

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మంత్రుల సమక్షంలో మదనపల్లె కాంగ్రెస్ నేతలు జనసేన పార్టీలోకి చేరారు. గురువారం పిఠాపురంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం మంత్రి దుర్గేశ్, ఏపీ మెడికల్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లె శ్రీనివాసులును నీరుగట్టువారిపల్లె వాసులు బండి మనోహర్, ఎం.రామ్మోహన్ కలిసి పార్టీలో చేరారు. మంత్రులు పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ జనసేన పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెద్దమండ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అధికారులు అందుబాటులో ఉండాలని మండల కూటమి నేతలు చల్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి, ఎస్టీసెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ పేర్కొన్నారు. పెద్దమండ్యంలో గురువారం కూటమి మండల అధికారులతో విడివిడిగా మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి సహకారంతో పెద్దమండ్యంలో మల్లికార్జున స్వామి ఆలయం వద్ద తాగునీటి పథకం బోరుకు కొత్త మోటార్, పైపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షేకేనాయక్ తండాలో తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని కార్యదర్శి మహమ్మద్‌కు చెప్పినట్లు తెలిపారు. కూటమి నేతలు ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్, తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కాలేషా, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిక్కా మధుకర, మహేశ్వర, సుబ్బరామిరెడ్డి, రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టు శిక్షణ పొందేందుకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి పేర్కొన్నారు. బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తదితర వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్ల మధ్య వారు అర్హులన్నారు. దరఖాస్తుదారులు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ వ్యవధి 45 రోజుకు అయితే రోజుకు 8 గంటల, 60 రోజులైతే 6 గంటలు, 90 రోజులైతే 4 గంటలు ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం తీసుకుని సంబంధిత సచివాలయంలో 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75% హాజరు ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లను అందజేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సింహవాహనంపై లక్ష్మీనృసింహుడు



పెద్దమండ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పాపేపల్లి కుషావతినది తీరంలో ఏకశిలగుట్టపై లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో రాత్రి స్వామి వారు సింహవాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. పగలు గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదారులు గల్లా కుటుంబీకులు రామకృష్ణయ్య, నరసింహాలు, నారాయణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

చలో విజయవాడను విజయవంతం చేయండి

మదనపల్లె టౌన్/వాల్మీకిపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్య లు పరిష్కరించాలని ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడను విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కోశాధికారి హరీంద్ర నాథ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్ఐ పథకా లు సక్రమంగా అమలు చేయాలన్నారు. రాజకీయ వేధింపులతో విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ వ్యాప్తంగా వున్న పంచాయతీ కార్మికులు విజయవాడకు వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం డీఎల్‌పీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికుల యూనియన్ నేతలు గోపాల్, రవి, శ్రీనివాసులు, రాజు, ఆనంద, శంకర, రాణి, కమల, శ్యామల, కార్మికులు వెంకటేష్, శ్రీరాములు, భారతమ్మ, శ్రీనివాసులు, వసంతమ్మ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి ముస్లిం పద్ధతిలో అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవతానగర్‌లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న అనాధ వృద్ధుడికి ముస్లిం పద్ధతిలో అంత్యక్రియలు చేశారు. గురువారం మృతి చెందడంతో మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సభ్యులు హనీఫ్, కిరణ్, చైతు, చర ణ్, హర్ష, చైతన్య నిర్వాహకులు ఆనందన్, కవితారాణి, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

కలకడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులు వేతనాలను పెంచాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారని గురువారం కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు. పీలేరులో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు పొత్తూరి ప్రభాకర్ నాయుడు, ప్యారీజాన్, జవాద్ అలీఖాన్, కార్యదర్శి దేవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కలకడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకులకు మెరుగైన సేవలందించాలని జిల్లా రవాణాధికారి రాము అన్నారు. గురువారం కలకడ బస్టాండులో రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ బస్సుల స్థితి గతులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. బస్సు కండీషన్‌ను పరిశీలించి రోడ్లపై తిప్పాలన్నారు. ఆర్టీసీకి ఆదాయం పెరిగేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. డిపో మేనేజర్ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దాడి పోలీసులకు ఫిర్యాదు

గుర్రంకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి దాడి చేసారంటూ ఓ మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెకు చెందిన కే.అలివేలమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె కూలీ పనుల నిమితం అగ్రవర్ణాలకు చెందిన సుధాకర్, బాలకృష్ణ పొలం నుంచి పనులకు వెళ్లతుండగా బాధితురాలిని కులం పేరుతో దూషించారు. తమ పొలం గుండా రావడానికి ఎంత ధైర్యమంటూ మహిళపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో బాధిత మహిళ అలివేలమ్మకు మెడపై, భుజం, కాలుపై రక్త గాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు అడ్డుకోవడంతో నిందితులు వెళ్లిపోయినట్లు తెలిపారు. తన తల్లిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని కుమారుడు నందీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించి న్యాయం చేస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

స్థల విషయమై...



గాయపడి చికిత్స పొందుతున్న మహిళ

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):స్థల విషయమై గొడవ పడి మహిళ తలకు గాయాలయ్యాయి. గురువారం మదనపల్లె పట్టణం, బీకేపల్లె, చంద్రాకాలనీ వాసి కృష్ణనాయక్ భార్య సుమిత్రకు చంద్రకాలనీలో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలంలో క్లీన్ చేస్తుండగా అదే కాలనీకి చెందిన బాల్‌రెడ్డి రాయితో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన మహిళను కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేశారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

బి.కొత్తకోట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటిపైకి డిష్ బిగిస్తూ ప్రమాదవశాత్తూ జారి కింద పడినట్లు పోలీసులు తెలిపారు. గురువారం సూరపువారిపల్లె వాసి రమేష్ డిష్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ ఇంటి మీదకు ఎక్కి పనులు చేస్తూ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు అతన్ని మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

'సేవల ఆధారంగానే నియామకం'

మదనపల్లె, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ ద్వారా 20ఏళ్లుగా తాను చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం తనకు వినియోగదారుల సేవాకేంద్రం జిల్లా సమన్వయకర్తగా నియమించిందని ఫేస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. 'వైసీపీ నేతకు అధికారిక పదవి' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. వినియోగదారుల ఫోరంలో ఈనెల ఏడోతేదీన అవకాశం కల్పిస్తే, తొమ్మిదో తేదీన వైసీపీ అధిష్ఠానం కూడా అనుబంధ విభాగంలో పదవి కల్పించినట్లు తెలిసిందన్నారు. దీంతో నేను అప్పట్లోనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి తన పదవికి రాజీనామా చేసి ఒరిజినల్ కాపీని గురువారం రెవెన్యూ అధికారులకు సమర్పించినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

కంట్లో కారంచల్లి కత్తితో దాడి

- మహిళకు తీవ్ర గాయాలు
- మెడలోని బంగారు గొలుసు అపహరణ


గాయపడిన లక్ష్మిదేవి

కమలాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కంట్లో కారం చల్లి.. కత్తితో దాడి చేసి మహిళ మెడలోని బంగారు గొలుసు దోచుకెళ్లిన సంఘటన గురువారం కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. కమలాపురంలోని గిడ్డంగి వీధిలో లక్ష్మి దేవి అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా.. అదే వీధికి చెందిన నవీన్ అనే యువకుడు ఆమె కంట్లోకారం పొడి చల్లి కత్తితో దాడి చేశాడు. దాడిలో మహిళ ముక్కు, మెడతో పాటు పలుచోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావంతో పడిపోయింది. దీంతో ఆమె మెడలో ఉన్న పది తులాల బంగారుసరుడు దోచుకెళ్లాడు. గాయపడిన మహిళను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణ జింకలు మృతి


కృష్ణ జింక కళేబరం

ములకలచెరువు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో రెండు కృష్ణజింకలు మృతి చెందాయి. స్థానిక పీటీఎం రోడ్డులోని టీటీడీ కల్యాణమండపం సమీపంలో రోడ్డు దాటుతున్న కృష్ణ జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ జింక అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే కదిరినాధునికోట పంచాయతీ కాసుపల్లె వద్ద కుక్కల గుంపు దాడి చేయడంతో మరో కృష్ణ జింక మృతి చెందింది. రెండు వేర్వేరు ఘటనల్లో మృతిచెందిన జింకలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం జింకల కళేబరాలను ఖననం చేశారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

రిమాండుకు ఇద్దరు నిందితులు

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీకేపల్లె, లక్ష్మీనగర్‌కు చెందిన భార్య, భర్తలు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె న్యూ బైపాస్ చంద్రకాలనీ సమీపంలో గంజాయి తరలిస్తున్న బీకేపల్లె, లక్ష్మీనగర్‌కు చెందిన ఆవుల మునిరాజా, అతని భార్య ఆవుల సుజాతను మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తన సిబ్బందిలో వెళ్లి అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని వారి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

సికెదిన్నె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపు తప్పి దగ్గటూరు రాజా (58) అనే వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజా, మహేశ్వర్‌రెడ్డిలు పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా మూలవంక, కొత్తపేట మధ్యలో బైకుకు అడ్డంగా కుక్క రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొన్నారు. ప్రమాదంలో దగ్గటూరు రాజా మరణించగా... గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలి

కడప (వినాయకనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డీఎస్సీకి ఉచిత కోచింగ్ తీసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎండీఎఫ్‌సీ.ఏపీ‌ఈఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో 15 లోగా వెబ్ ఆప్షన్‌లు ఎంచుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. వెబ్ ఆప్షన్ ప్రారంభించామని ఇప్పటికే వెయ్యి మంది అభ్యర్థులు తమ ఆప్షన్‌లు పూర్తి చేశారన్నారు. షార్టులిస్టు చేసిన అభ్యర్థుందరూ సకాలంలో వారి వెబ్ ఆప్షన్‌లు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. వెబ్ ఆప్షన్ సర్వీసు ద్వారా కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యతను తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

కేబుల్ వైర్ల దొంగలు అరెస్ట్

నిమ్మనపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలించిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. చంద్రాకాలనీకి చెందిన పడిగి నాగరాజు, కురబలకోట మండలం అంగళ్లకు చెందిన చంద్రశేఖర్ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. వీరు దాదాపు 2 నెలలుగా అగ్రహారం, తవళం, నిమ్మనపల్లి పంచాయతీల్లో వ్యవసాయ బోర్ల వద్ద రైతులు బోర్లకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను రాత్రి సమయాల్లో కట్ చేసి దొంగలించారు. అప్పటికే పలువురు రైతుల కేబుల్ వైర్ల దొంగలు దోచుకెళ్లారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వీరి నుంచి 500 మీటర్ల కేబుల్ వైరును రికవరీ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి


సుబ్రమణ్యం మృతదేహం

పీలేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లె పంచాయతీ ఎగువ దళితవాడకు చెందిన ఆరమడకల సుబ్రమణ్యం (55) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలచెరువులో చేపలు పట్టడానికి వల విసిరి నీటిలోకి వెళ్లాడు. విసిరిన వల సుబ్రమణ్యం కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగాడు. గుర్తించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. నీటిలో ఊపిరాడక చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రాజంపేటలో పౌల్ట్రీస్థలం పరిశీలన

- ఇతర స్థలాలపై కూడా దృష్టి
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి


రాజంపేటలో ఎస్సీ కార్పొరేషన్ స్థలాలను పరిశీలిస్తున్న ఈడీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ స్థలాలు పరిశీలించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం అనే శీర్షిక ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ఎస్సీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం స్థలాల పశీలనకు సిద్ధమైంది. ఇందులో భాగంగా రాజంపేట మండలంలోని తాళ్లపాక వద్దనున్న పౌల్ట్రీ కాంప్లెక్స్ స్థలాలను గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, డైరెక్టర్ అనిత దీప్తి, దళిత సంఘాల ప్రతినిధులు పరిశీలించారు. ఈ విషయంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి సంప్రదించగా రాజంపేట వద్దనున్న పౌల్ట్రీలో చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. గతంలో జీవనాధారం కోసం పౌల్ట్రీలు ఇచ్చిన వారిలో కొంత మంది అందుబాటులో లేకపోవడంతో మరో దఫా పరిశీలించాల్సి ఉందన్నారు. తహసీల్దార్ కూడా అందుబాటులో లేరన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన మొత్తం పది ఎకరాలు స్థలం ఉండగా పౌల్ట్రీ షెడ్ల కోసం కొంత స్థలాన్ని నిర్మించి మిగిలిన జాగాను ఖాళీగా ఉంచడం జరిగిందన్నారు. ఆ ఖాళీస్థలం కూడా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. కొంత స్థలాన్ని కొంతమంది విక్రయించినట్లు కూడా తమ విచారణలో ఆరోపణలు వచ్చాయన్నారు. ఏదిఏమైన ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన భూములు ఎంత వరకు ఉన్నాయనే విషయంపై తహసీల్దార్‌కు లేఖ రాసి హద్దులు చూపమని అడగనున్నట్లు తెలిపారు. పౌల్ట్రీ స్థలాల ఆక్రమణ అంశంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె వివరించారు.

హోలీ పండుగను సురక్షితంగా చేసుకోండి

రాయచోటిటౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): హోలి పండుగను సురక్షితంగా, బాధ్యతతో జరుపుకోవాలని... పండుగ పేరుతో సంబంధం లేని వ్యక్తులపై రంగులు చల్లినా, ఆడవారితో అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా హోలీ పండుగను జరుపుకోవాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని తెలిపారు. హోలీ పేరుతో ఎవరైనా ఎవరైనా బలవంతంగా చందాలు వసూలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వీధుల్లో ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా తిరగడం, భారీ శబ్దాలు చేయడం లాంటివి అనుమతి లేదన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100, 112 నెంబర్లకు డయల్ చేయడమే కాకుండా సమీప పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

సురక్షితంగా జరుపుకోవాలి : కడప ఎస్పీ

కడప క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను సురక్షితంగా .. బాధ్యతతో మత సామరస్యం పాటిస్తూ.. ఎటువంటి గొడవలకు తావు లేకుండా సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా హద్దులు దాటితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం లాంటివి చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

మామిడి పూత, పిందెలను కాపాడుకుంటేనే మంచి ఫలితాలు


మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

కలికిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మామిడి పూతకు వాతావరణ అనిశ్చితి ప్రతిబంధకంగా మారిందని, రైతులు అప్రమత్తంగా ఉండి పూత, పిందెను కాపాడుకుంటే నే ఆశించిన విధంగా మంచి ఫలితాలు వస్తాయని పలువురు శాస్త్రవేత్తలు తెలిపారు. గురువారం స్థానిక కేవీకేలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలికిరి, వాల్మీకిపురం రైతులకు అవగాహన నిర్వహించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సరైన సమయంలో సస్యరక్షణ చర్యల ద్వారా పూత రాలడాన్ని నిలువరించవచ్చన్నారు. పూత మొగ్గ దశలో తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు ఆశించే అవకాశమున్నట్లు చెప్పారు. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ., కార్బెండిజమ్ 1 గ్రాము వేపనూనె 2 మి.లీ, జిగురు మందు 0.5 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా క్లోరిఫైరిఫాస్ 2 మి.లీ, మ్యాంకోజెబ్ 2 గ్రాముల వేపనూనె 2. మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవచ్చన్నారు. చెట్టు కాండం, కొమ్మలు, ఆకులు బాగా తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. అలాగే రెండో దశ అయిన పచ్చిపూత దశలో బుప్రోఫుజన్ 1.5 మి.లీ, హెక్సాకోనజోల్ 2 మి.లీ, బోరాన్ 1 గ్రాము, అజాడైరెక్టిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లపూత దశలో ఉన్నప్పుడు ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదన్నారు. పూత పిందె రాలకుండా 0.2 మి.లీ ప్లానోఫిక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పిందెలు బాదం గింజ సైజులో ఉన్నప్పుడు నీటి వసతి ఉన్న తోటల్లో చెట్టుకు కిలో యూరియా, 750 గ్రాము పొటాష్ చొప్పున వేసి తడులు ఇవ్వాలన్నారు. నిమ్మకాయ సైజు దశ వరకూ తామర పురుగు, తొడిమ కుళ్లు తెగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పీలేరు ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ మామిడి కాయల రక్షణకు అవసరమైన కవర్‌లను సబ్సిడీలో అందజేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో కవరు ధర రూ.2.20 కాగా ఇందులో సబ్సిడీ ఒక రూపాయన్నారు. కవరుకు రూ.1.20 వంతున చెల్లించి అవసరమైన కవర్‌లు పొందవచ్చని తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ మంజుల, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, పీరూసాహెబ్, పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన శాఖ అధికార్లు సుకుమార్ రెడ్డి, ఈశ్వరప్రసాద్ రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణోత్సవం

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గురువారం శ్రీనివాసుని కల్యాణోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు మంత్రోచ్చారణతో వివాహ క్రతువు జరిపించారు. సరస్వతి పూజలో భాగంగా చిన్నారులకు ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధన్ భట్టర్ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయమాజీ ఛైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, గంగారపు భాస్కర్‌రెడ్డి, నాగేంద్ర, సాయిచిత్ర భాస్కర్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

మదనపల్లెఅర్బన్, మార్చి 13: చిన్నరెడ్డెప్పరెడ్డికి చెందిన భూమి సర్వే నిర్వహిస్తుండగా అతని వ్యతిరేక వర్గం సర్వేను అడ్డుకుని దాడి చేసి నలుగురిని కర్రలు, రాళ్లతో కొట్టి గాయపరిచారు. ఇరువర్గాల ఘర్షణలో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దమండ్యం మండలం, వెలిగల్లు, మిట్టావారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్పరెడ్డికి అంగళ్లలో అర ఎకరం పొలం ఉంది. దీనికి రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే నిర్వహిస్తుండగా మరొక వర్గం కురబలకోట మండలం, తుమ్మచెట్లపల్లెకు చెందిన రెడ్డెప్ప, అతని భార్య రాధమ్మ, శ్రీనివాసులు, కాంతమ్మ, రామరాజు, రమణ, మహేష్, మూలగంటి శ్రీనివాసులరెడ్డి, గీతా, రాజేష్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, ప్రకాష్, వెలిగల్లు, మిట్టావారిపల్లెకు చెందిన సాంబశివారెడ్డి, పార్వతమ్మ, రెడ్డెప్పరెడ్డి, భార్గవ్‌రెడ్డి దాడి చేసినట్లు తెలిపారు.

ఖాజీపేటలో పేలనున్న మరో ఐపీ బాంబ్?

- రూ. 5 నుంచి 7 కోట్లతో వ్యాపారి పరార్


నూనె అంగడి వద్ద గుమికూడిన రుణదాతలు

ఖాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల కిందట రూ.2 కోట్లతో ఐపీ పెట్టిన వ్యక్తి గురించి చర్చించుకుంటుండగానే గురువారం మరో వ్యక్తి భారీ ఎత్తున ఐపీ పెట్టి ఉడాయించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట మండలం బోయపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొంత కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం, నూనె వ్యాపారం చేస్తూ ప్రజలను ఆకర్షించాడు. మూడు నెలల కిందట ఖాజీపేట మైదుకూరు రహదారిలో సూపర్‌మార్కెట్ భారీ ఎత్తున ప్రారంభించాడు. దీంతో అడిగిన ప్రతి ఒక్కరూ అతనికి రుణం ఇచ్చేందుకు ఇష్టపడ్డారు. ఇదే అదునుగా ఆ వ్యక్తి రూ. 5 కోట్ల నుంచి రూ.7 కోట్ల దాకా రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈనెల 10వ తేదీ 'ఆంధ్రజ్యోతి'లో ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబ్ కథనంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో సూపర్‌మార్కెట్ నడుపుతున్న వ్యక్తి పరిస్థితి గురించి తెలుసుకునేందుకు అక్కడకు వెళ్లగా.. ఆ వ్యక్తి అప్పటికే పరారీ అయి సెల్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో కోపోద్రిక్తులైన జనం సూపర్‌మార్కెట్, ఆయిల్ అంగడి వద్ద గొడవచేయడంతో ఆ వ్యక్తి బావమరిది తాళాలు వేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించడానికి వెళ్లినట్లు సమాచారం. దీంతో ఖాజీపేట బస్టాండులోని కిరాణాషాపులో జరిగినట్లు ఇక్కడ కూడా సరుకు మాయం అవుతుందోమేమోనని రుణదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలి

మదనపల్లె అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలని మదనపల్లె డయాలసిస్ సెంటర్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాశ్విత సూచించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ సెంటర్‌లో గురువారం జాతీయ కిడ్నీడే మేనేజరు బాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ శాశ్విత మాట్లాడుతూ ఐదు జాగ్రత్తలు పాటిస్తే కిడ్నీలను కాపాడు కోవచ్చని, బీపీ, షుగర్ దరిచేరకుండా, మద్యం, జంక్‌ఫుడ్స్, స్మోకింగ్ అలవాట్ల జోలికి వెళ్లకపోతే మంచిదన్నారు. కిడ్నీ బాధితులకు డయాలసిస్ తప్ప కిడ్నీ మార్పిడి సామాన్యులకు సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి, వైద్యసిబ్బంది, డయాలసిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ పనులకు టెండర్ల ఆహ్వానం

బి.కొత్తకోట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో రూ.13.67 లక్షలతో చేపట్టనున్న 3 పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు నగరపంచాయతీ కమిషనర్ పల్లవి తెలిపారు. 15న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, 22న సాయంత్రం 4 గంటలకు హెచ్చు బిడ్ దాఖలు దారులకు పనులు అప్పగిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పనులు చేసేందుకు బిడ్ దాఖలు చేయాలని ఆమె కోరారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అదనపు ఆర్థిక సహాయం

కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి(కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లుగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయంపై పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సాయం మొత్తాన్ని వివిధ దశల్లో అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. బీఎల్ దశలో 50 వేల రూపాయలు, చివరి దశలో ఉన్న ఇళ్లకు 10 వేలా 15 వేల రూపాయలు (వర్గాన్ని బట్టి) అందిస్తామని, అలాగే వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు ఆయా దశల బట్టి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అన్నమయ్య జిల్లలో దాదాపు 19,672 మందికి రూ.100 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లిక ఆర్థిక సాయం గురించి చెప్పి దశల వారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై అన్ని మండలాల ఎంపీడీఓలకు, హౌసింగ్ సిబ్బందికి ఇది వరకే తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో 75 వేల లబ్ధిదారులకు 37 వేల మంది ఇళ్ల నిర్మాణా న్ని పూర్తి చేసుకున్నారని సమావేశంలో హౌసింగ్ శాఖ పీడీ సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఔదార్యం

- క్యాన్సర్ బాధిత విద్యార్థికి రూ.6లక్షల సాయం


బాధిత విద్యార్థి తండ్రికి రూ.6లక్షలను అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు, ఏఓ రవికుమార్

వేంపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థి జబ్బుతో బాధపడుతుంటే సహచర విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో విద్యార్థులు నడుపుతున్న సేవాసంస్థ ద్వారా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నుంచి రూ.5.02 లక్షలు, మిగిలిన ట్రిపుల్‌ఐటీల ద్వారా మరో లక్ష రూపాయలు సేకరించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సురేంద్ర అనే విద్యార్థి బ్లడ్ మరియు బోన్ క్యాన్సర్‌తో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు రూ.40లక్షలు చికిత్సకు అవసరం కాగా విద్యార్థులు సేకరించిన రూ.6లక్షలను బుధవారం ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్ చేతులమీదుగా బాధిత విద్యార్థి తండ్రి పొలురాజుకు అందజేశారు. విద్యార్థుల సహాయాన్ని ఎన్నటికీ మరువలేనని విద్యార్థి తండ్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా దాతలు ముందు కొచ్చి సహాయం చేస్తే విద్యార్థి ప్రాణాలు కాపాడడంలో భాగస్వాములవుతారని... సహాయం చేయదలచిన వారు 8688283876 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కడప మెడికల్ కాలేజీ డీడీగా హేమలత

కలికిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ. హేమలతను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో మెడికల్ సర్వీసెస్ ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్‌గా డెప్యుటేషన్‌పై పని చేస్తున్న హేమలతను మాతృ సంస్థలోకి తిప్పి పంపుతూ ప్రస్తుతం ఖాళీగా వున్న వైద్య కళాశాల డీడీగా నియమించారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కడప కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యుజన, క్రీడా వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల పోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 16వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ తెలిపారు. పోటీలలో పాల్గొనే యువత ఒన్ నేషన్.. ఒన్ ఎలక్షన్ అనే అంశంపై ఉప న్యాసాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన వారు దేశస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ప్రధానంగా అన్నమయ్య, కడప జిల్లా పరిధిలోని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువత రిజిస్ట్రేషన్ చేసు కునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 15న కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వ హించాల్సిన ఉపన్యాస పోటీలు రిజిస్ట్రేషన్ గడువు పెంపు కారణంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువత ఈ మార్పును గమనించాలని కోరారు. ఉపన్యాస పోటీలు తదుపరి నిర్వహించే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.